కుంట్లూర్ భూదాన్ భూమిలో అర్ధరాత్రి హైడ్రామా?

- గుడిసెల తొలగింపునకు పోలీసు బలగాలు చేరుకుంటున్నట్లు ప్రచారం
- పోలీసులను ఎదుర్కొనేందుకు సిద్ధమైన గుడిసెవాసులు, సీపీఐ నేతలు
- సీపీఐ నేతలతో తహసీల్దార్ చర్చలు.. వారం రోజుల్లో తొలగించాలని ఆదేశం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ ఫెజ్-3లో గురువారం అర్ధరాత్రి హైడ్రామా నెలకొంది. ఏడాదిన్నర క్రితం భూదాన భూమిలో వెలసిన గుడిసెలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బలగాలతో గుడిసెల వద్దకు చేరుకుంటున్నట్లు ప్రచారం కావడంతో గుడిసె వాసులతో పాటు సీపీఐ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తమయ్యారు. దీంతో వేలాది మంది గుడిసెవాసులు పోలీసులను ఎదుర్కొనేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దాంతో గురువారం అర్ధరాత్రి ఆ ప్రాంతంలో హైటెన్షన్ నెలకొంది. అక్కడ పరిస్థితులు అధికారులకు, పోలీసులకు తెలియడంతో గుడిసెల తొలగింపు కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.



గుడిసెవాసులతో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

కోర్టు ఆదేశాలతో..

గత ఏడాది జనవరి 22న కుంట్లూర్ పరిధిలోని భూదాన భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో సుమారు 100 ఎకరాల్లో గుడిసెలు వెలిశాయి. కేవలం రెండు రోజుల్లోనే అక్కడ సుమారు 10 వేల గుడిసెలు ఏర్పడ్డాయి. కాగా అప్పటి నుంచి చాలా మంది గుడిసె వాసులు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇటీవలే భూదాన భూమిలో వెలసిన గుడిసెలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు కోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో ముహూర్తం చూసుకున్న అధికారులు పోలీసు బలగాల సహకారంతో గుడిసెలను తొలగించేందుకు గురువారం రాత్రి రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అందుకోసం చింతలకుంటలోని ఓ గార్డెన్‌లో పోలీసు బలగాలను దించినట్లు తెలిసింది. గుడిసెల ప్రాంతాన్ని పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిశీలించినట్లు సమాచారం. ఆ ప్రాంతలో డ్రోన్‌లు తిరుగుతుండడంతో అనుమానం వచ్చిన సీపీఐ నేతలతో పాటు గుడిసెవాసులు అప్రమత్తం అయ్యారు. పోలీసులను ఎదుర్కొనేందుకు అప్పటికప్పుడు వేలాది మంది గుడిసెవాసులు గుమిగూడారు. గుడిసెల చుట్టూ వందలాది మంది పహారా కాశారు. పోలీసుల బలగాల కంటే గుడిసెవాసులు పెద్ద సంఖ్యలో ఉండడంతో ఉన్నత అధికారుల ఆదేశాలతో గుడిసెల తొలగింపు కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్లు సమాచారం.

సీపీఐ నేతలతో తహసీల్దార్ చర్చలు

కాగా శుక్రవారం ఉదయం సీపీఐ నేతలు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్‌తో పాటు గుడిసెవాసులతో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ చర్చలు జరిపారు. భూదాన భూమిలో వెలసిన గుడిసెలను తొలగించాలని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినట్లు వారికి వివరించారు. వారం రోజుల్లో మీరే వాటిని తొలగించాలని సూచించారు. లేదంటే పోలీసు బలగాలతో తొలగించాల్సి వస్తోందని హెచ్చరించారు. దీనికి సీపీఐ నేతలు ఒప్పుకోలేదు. ఇది భూదాన భూమి అంటూ తాము కూడా కోర్టులోనే తెల్చుకుంటామని తహసీల్దార్‌కు సమాధానం ఇచ్చారు. దీనిపై ఎలాంటి చర్యలు ఉంటాయో మరో వారం రోజులు వేసి చూడాలి.



సీపీఐ నేతలతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ రవీందర్‌దత్, ఇన్‌స్పెక్టర్ తదితరులు

మూసానగర్ స్కూల్ యూపీఎస్ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నందనవనంలోని మూసానగర్ యూపీఎస్ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయినట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను ఎమ్మెల్యే వారి కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం 8వ తరగతి వరకు కొనసాగుతున్న మూసానగర్ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ముఖ్య కార్యదర్శి జీఓ జారీ చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో 9,10 తరగతులకు అనుమతులతో పాటు వసతులు, ఉపాధ్యాయుల నియామకం చేపట్టడానికి ఆయన జీఓ జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి నుంచి 9వ తరగతిలోకి 88మంది విద్యార్థులు చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు అనంతుల రాజిరెడ్డి, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, సుజిత్ తదితరులు ఉన్నారు.

రహదారి పనులను నాణ్యతగా చేపట్టాలి



అధికారులు, క్రాంతినగర్ కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని క్రాంతినగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.21లక్షలతో చేపట్టిన సీసీ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజేందర్, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు ఆనంద్, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, జనార్దన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలి



డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మూసారాంబాగ్ డివిజన్ పరిధిలోకి వచ్చే గడ్డిఅన్నారం బస్తీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రానున్న బోనాల ఉత్సవాలకు ముందే డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమె జలమండలి అధికారులకు సూచించారు. అనంతరం గడ్డిఅన్నారంలోని శ్రీపొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, శాలివాహననగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను కార్పొరేటర్ పరిశీలించారు. పాఠశాలల ప్రిన్సిపాల్ శారద, కనకవల్లి, హరిచందన, స్థానికులు నీరుడు ప్రభాకర్, ధన్‌రాజ్, సందీప్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి అవసరమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గీర్, బీచ్‌కుంద, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదళ్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు నేరుగా డీఎంతో మాట్లాడేందుకు వీలుగా ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. 9959225249 ద్వారా ప్రయాణికులు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి



చండి హవనం హోమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

వనస్థలిపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరు సుఖశాంతులతో జీవించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మన్సూరాబాద్‌లోని ఎంఇరెడ్డి గార్డెన్స్‌లో శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ ది పార్ట్ ఆఫ్ ధర్మో రక్షిత రక్షతః ట్రస్ట్ ఆధ్వర్యంలో చండి హవనం హోమం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శైవ క్షేత్ర పీఠాధిపతులు పరమ పూజ్య శివ స్వామిజీ, సంస్థ ప్రతినిధులు బెల్దే రవికుమార్, చింతల రజనీకాంత్, ఎల్‌పీ కుమార్ పాల్గొన్నారు.

ఆగిన బాక్స్‌డ్రెయిన్ పనులను పునరుద్ధరించాలి



జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో గాయిత్రీపురం, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, బృందావన్ కాలనీల మీదుగా మూసీ వరకు చేపడుతున్న బాక్స్‌డ్రెయిన్ పనులను పునరుద్ధరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజకు విన్నవించారు. శుక్రవారం ఆయన కమిషనర్‌ను కలిసి ఆగిన అభివృద్ధి పనులతో డివిజన్‌లో నెలకొన్న సమస్యలను గుర్తుచేశారు. బాక్స్‌డ్రెయిన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ఆ తర్వాత పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సత్యానగర్, రాజీవ్‌గాంధీనగర్, భరత్‌నగర్‌లలో నూతన అంతర్గత దారుల కోసం చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మించాలి

కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ -2, శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, మోహన్‌నగర్‌బస్తీ, గోకుల్‌నగర్‌లలో పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో ఎక్కువ సామర్థ్యం గల నూతన పైప్‌లైన్లు వేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ శుక్రవారం జలమండలి జీఎం బలరామరాజుకు విన్నవించారు. పలు కాలనీల్లో తరచూ తాగునీరు కలుషితమవుతోందని, డ్రైనేజీ పైప్‌లైన్లు మార్చకపోతే ఈ సమస్య జటిలమవుతోందన్నారు. అనంతరం ఆయన జీఎంకు వినతిపత్రం అందజేశారు.

ఆకట్టుకున్న హరికథా గానం.. 'సీతా కల్యాణం'



హరికథ గానం చేస్తున్న సింహాచలశాస్త్రి

కొత్తపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి గోదా సమేత పద్మావతీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి డా. ఎం. సింహాచల శాస్త్రి హరికథా గానం 'సీతా కల్యాణం' భక్తులందరినీ ఆకట్టుకుంది. మధ్వాధూల రమాకాంతాచార్యస్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కల్యాణ వేదికపై హరికథా గానం 'సీతా కల్యాణం'తో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ ఛైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం శ్రీ లాస్య నృత్యాలయ విశాఖ ప్రకాష్ శిష్య బృందం 'శ్రీనివాస కల్యాణం' భరతనాట్య రూపకం కనువిందు చేసింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

న్యూసెన్స్ చేయొద్దన్నందుకు.. గంజాయి మత్తులో దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు, ఏడుగురు పోకిరీల అరెస్టు

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అపరాత్రి లేకుండా మద్యం తాగుతూ.. న్యూసెన్స్ చేయొద్దన్నందుకు ఓ వ్యక్తిపై పోకిరీల గుంపు దాడిచేసింది. గంజాయి మత్తులో తూగుతున్న ఏడుగురు యువకులు రాళ్లు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి, కటకటాల్లోకి నెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ నేతాజీనగర్‌లో బుధవారం రాత్రి జనార్దన్ నాయుడు అనే వ్యక్తి ఇంటి ముందు ఖాళీ జాగాకు కాపలా ఉంటున్న కొందురు వ్యక్తులు ప్రతి రోజు మద్యం, గంజాయి తాగుతూ చుట్టుపక్కల వాళ్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రోజు రోజుకు వారి న్యూసెన్స్ ఎక్కువకావడంతో ఎదురింటి ఓనర్ జనార్దన్‌నాయుడు ఇక్కడ న్యూసెన్స్ చేయొద్దని వారిని హెచ్చరించాడు. దాంతో మద్యం, గంజాయి మత్తులో ఉన్న పోకిరీలు జనార్దన్‌నాయుడుపై కర్రలతో కొడుతూ, రాళ్లు విసురుతూ.. విచక్షణలేకుండా తీవ్రంగా గాయపరిచారు. జనార్దన్ ఇంటిపై దాడిచేసి అద్దాలు పగలగొట్టారు. ఘటనపై కుటుంబ సభ్యులు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితున్ని మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన మడ్డి శంకుయాదవ్, ఎల్బీనగర్ భరత్‌నగర్ కాలనీకి చెందిన గద్దీయరాజు వంశీ, చెనగోని హరీష్, హయత్‌నగర్ బొమ్మలగుడి ప్రాంతానికి చెందిన బోజి షాహీద్, మహ్మద్ సోనూ, భరత్‌నగర్ కాలనీకి చెందిన ఈదులకంటి మనోజ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన రెహన్ ఉన్నారు.



న్యూసెన్స్ చేయొద్దన్నందుకు వ్యక్తిపై దాడి చేస్తున్న గంజాయి బ్యాచ్

మంథని మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్ పుట్ట శైలజ ఎన్నిక చెల్లదు

- రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టు తీర్పు



వివరాలను వెల్లడిస్తున్న న్యాయవాది రాపోలు భాస్కర్, చిత్రంలో పిటిషనర్ సయేదా ఆయేషా ఫాతిమా

చాదర్‌ఘాట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్ పుట్ట శైలజ ఎన్నిక చెల్లదంటూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. 2020 జనవరిలో జరిగిన మంథని మునిసిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచిన పుట్ట శైలజ తన అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు నమోదు చేశారంటూ.. ఆమెపై కౌన్సిలర్‌గా పోటీచేసి ఓడిపోయిన సయేదా ఆయేషా ఫాతిమా అప్పట్లోనే కరీంనగర్ జిల్లా కోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున కేసు వాదించిన న్యాయవాది వామన్‌రావు దంపతుల హత్య అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. శైలజ భర్త ప్రస్తుత జిల్లా పరిషత్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నుంచి తమకు ప్రాణభయం ఉందని సయేదా ఆయేషా ఫాతిమా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఆదేశాలతో కేసును కరీంనగర్ జిల్లా కోర్టు నుంచి రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. పిటిషనర్ తరఫున హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కేసు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు.. కౌన్సిలర్‌గా శైలజ ఎన్నికల చెల్లదంటూ తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా మలక్‌పేటలోని కల్యాణనగర్‌లో మీడియా సమావేశంలో న్యాయవాది రాపోలు భాస్కర్ పిటిషనర్‌తో కలిసి మాట్లాడారు. కోర్టు తీర్పు మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం మంథని మునిసిపాలిటీకి ఛైర్‌పర్సన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. కోర్టు తీర్పుతో హత్యకు గురైన న్యాయవాది వామన్‌రావు దంపతుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. ఈ కేసు విషయంలో పుట్ట మధు, అతని అనుచరుల నుంచి తమపై అనేక రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినట్లు తెలిపారు. అయినా తాము లెక్కచేయకుండా న్యాయపోరాటం చేశామని, కోర్టు తమకు న్యాయం చేసిందంటూ ఆనందం వ్యక్తం చేశారు.



కవాడిపల్లి పాఠశాలలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీవాణి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి



చంపాపేటలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఛైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, హెచ్‌ఎం అనంతరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవో శ్రీవాణి అన్నారు. మండల పరిధిలోని కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం దశరథరెడ్డితో కలిసి విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. అనంతరం శ్రీవాణి మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రమేష్, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ వనజ, వీపీఏ గిరిజా, ఉపాధ్యాయులు స్వర్ణలత, ప్రకాష్, శ్రీనివాస్, రాములయ్య, గౌరి, చైతన్య భారతి, సుజాత పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట్‌లో..

పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్, హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర సురేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మూసానగర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

సామూహిక అక్షరాభ్యాసం

చంపాపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఫౌండర్ ఛైర్మన్ లీలా లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, రమేష్ గురూజీ, ఉపాధ్యాయులు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రాంరెడ్డి, కావ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చంపాపేట: విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలోని మూసానగర్ హైస్కూల్‌లో ప్రొ:జయశంకర్ సార్ బడిబాటలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, రేణుక, నర్సింహ, మహేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

వనస్థలిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని, రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తప్పనిసరిగా విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని, రాష్ట్ర, జిల్లా, మండల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు కొంద్రు శంకర్, చింతా బాబుమాదిగ, కోదాస్ మోహన్, గెలువయ్య, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

చాదర్‌ఘాట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు విలువైన వస్తువులను దొంగిలించి పారిపోయారు. మలక్‌పేట ఎస్‌ఐ కిరణ్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం మలక్‌పేట రెవెన్యూ బోర్డు కాలనీ నివాసి బాలనాగమ్మ తమ కుటుంబీకుడు ఆస్పత్రిలో ఉండడంతో చూడడానికి వెళ్లేందుకు శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేశారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళాలు పగిలి ఉన్నట్లుగా గుర్తించి మలక్‌పేట పోలీసులకు బాలనాగమ్మ సమాచారం ఇచ్చారు. ఈమేరకు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఐ కిరణ్‌లాల్ తమ సిబ్బందితో రంగంలోకి దిగారు. అయితే ఏఏ వస్తువులు దొంగతనానికి గురయ్యాయి. ఏ మేరకు చోరీ జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది. మలక్‌పేట క్రైం పోలీసులు, వేలిముద్ర నిపుణులను సేకరించి ఎంత మంది దొంగతనానికి వచ్చారనే వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. కేసును మలక్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్జీవోస్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నికలు వాయిదా

వనస్థలిపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఈనెల 16న జరగాల్సి ఉండగా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్వర్వుల ప్రకారం వాయిదా వేయడం జరిగిందని ఎన్నికల అధికారి వి.బాబురావు తెలిపారు.

న్యాయ పరమైన సలహా ప్రకారం తదుపరి తేదీలను ప్రకటించే వరకు సంఘం సభ్యులందరు ఈ విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలలోకి వచ్చిన పాము

- చంపేసిన మధ్యాహ్న భోజన కార్మికులు

హయత్‌నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాగన్నగూడలోని ప్రభుత్వ పాఠశాలలో చెట్లు చెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో పాములకు ఆవాసంగా మారింది. పాఠశాల ఆవరణలో, ఆవరణ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో అందులోకి విపరీతంగా పాములు, క్రిమి కీటకాలు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలోకి ఒక త్రాచు పాము వచ్చింది. అక్కడే వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు చూసి పామును చంపేశారు. ఇప్పటికైనా తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ స్పందించి పాఠశాల ఆవరణ, చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను శానిటేషన్ సిబ్బంది చేత తొలగింప జేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పామును చంపేసిన మధ్యాహ్న భోజన కార్మికురాలు

నకిలీ పత్రాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.5 కోట్లు టోకరా

- మీర్‌పేట్ కార్పొరేటర్ అరెస్టు



నరేంద్రకుమార్

సరూర్‌నగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భూములపై పెట్టుబడి పేరిట నకిలీ ఒప్పంద పత్రాలు చూపించి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని రూ.5 కోట్ల మేర మోసం చేశారనే ఆరోపణలపై మీర్‌పేట్ 13వ డివిజన్ కార్పొరేటర్ నరేంద్ర కుమార్ అరెస్ట్ అయ్యారు. మీర్‌పేట పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌కు 2020లో జరిగిన ఎన్నికల్లో నరేంద్రకుమార్ అలియాస్ నందు 13వ డివిజన్ నుంచి బీజేపీ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరిన నందు... ఇటీవల లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నరేంద్రకుమార్ స్థానికంగా చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుంటారు. ఈ క్రమంలో చంపాపేట్‌కు చెందిన చిట్టోజు కృష్ణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్‌లో భూములపై పెట్టుబడికి ఒప్పించి రూ.5 కోట్లు తీసుకున్నాడు. అనంతరం కొంగరకలాన్‌కు చెందిన తుమ్మల ధీరజ్‌రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్‌కు చెందిన 6.17ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లుగా వారి పేరుతో ఓ నకిలీ ఒప్పంద పత్రాన్ని తయారు చేయించి చూపెట్టాడు. అయితే, రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ మాట దాటవేస్తుండడంతో అనుమానించిన కృష్ణ నేరుగా కొంగర్‌కలాన్‌కు వెళ్లి భూయజమానులతో మాట్లాడాడు. నరేంద్ర కుమార్‌తో తాము ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని వారు చెప్పడంతో మోసపోయానని గ్రహించిన చిట్టోజు కృష్ణ మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించాడు. కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నరేంద్రకుమార్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హర్షలత

ఎల్బీనగర్: కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన తమలపాకుల హర్షలత నియమితులయ్యారు. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హర్షలతకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలి

వనస్థలిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని టీపీసీసీ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముసుకు శేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జక్కిడి ప్రభాకర్‌రెడ్డి రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముసుకు లోకేష్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.